# సాక్షి వికారాబాద్

బుధవారం, 20, నవంబర్, 2024






**అప్రమత్తతే ఆయుధం**

కంది సాగులో ఎప్పటికప్పుడు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని శాస్త్రవేత్త డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. 8లో▸



**రాజ్యాధికారమే లక్ష్యం**


జీసీలకు రాజ్యాధికారమే లక్ష్యమని ఆ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు కందుకూరి రాజ్‌కుమార్ అన్నారు. 8లో▸



**భూములు ఇవ్వకుంటే..**

ఫార్మాసిటీకి భూములు ఇవ్వని రైతులపై కేసులు పెట్టడం దారుణమని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. 8లో▸

# పెరుగుతున్న మద్దతు



లగచర్ల గ్రామం

## ఫార్మా బాధితులకు అండగా నిలుస్తున్న ప్రతిపక్షాలు

- గల్లీ నుంచి ఢిల్లీ దాకా వాయిస్ వినిపిస్తున్న వైనం
- తాజాగా రంగంలోకి మహిళా సంఘాలు
- లగచర్లకు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు
- వ్యతిరేక గళం వినిపిస్తున్న సొంత పార్టీ నేతలు
- ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు

**వికారాబాద్:** లగచర్ల ఫార్మా బాధితులకు రోజురోజుకూ మద్దతు పెరుగుతోంది. ఇదే సమయంలో ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీపై నిరసన జ్వాలలు వెల్లువెత్తుతున్నాయి. వారం రోజుల క్రితం లగచర్లలో అధికారులపై దాడి జరిగిన సమయంలో బాధితులుగా అధికారులు కనిపించారు. వారికి మద్దతుగా ఉద్యోగ సంఘాలతో పాటు కాంగ్రెస్ పార్టీ నేతలు గళం వినిపించారు. బీజేపీ సైతం అధికారులపై జరిగిన దాడిని ఖండించింది. పోలీసుల రంగ ప్రవేశం, అరెస్టులతో సీన్ మొత్తం మారిపోయింది. వారం తిరిగేలోగా ఫార్మాసిటీలో భూములు కోల్పోనున్న రైతులు బాధితులుగా మారారు. లగచర్ల ఘటన అనంతరం పోలీసుల తీరు కూడా పరిస్థితి మారడానికి కారణమయ్యింది. ఇప్పటికే ఆయా పార్టీలు, ప్రజా సంఘాలు రైతులకు అండగా నిలిచారు. దీంతో వారు బయటకు వచ్చి తమ గోడును వినిపించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రతిపక్ష పార్టీలతో పాటు సొంత పార్టీ నేతలు సైతం ఫార్మా బాధితులకు మద్దతు ప్రకటిస్తున్నారు. దీంతో అధికార పార్టీ ఇరకాటంలో పడింది. దాడి ఘటన నేపథ్యంలో పరిగి డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డిపై బదిలీ వేటు పడింది. అతన్ని డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పోలీసు యంత్రాంగం కూడా ఆత్మరక్షణలో పడిపోయింది.

### జీవన్మరణ సమస్య కావడంతోనే..

మూడు నెలల క్రితం ప్రభుత్వం కొడంగల్ నియోజకవర్గం, దుద్యాల్ మండలంలో ఫార్మాసిటీ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. లగచర్ల, పోలెపల్లి, హకీంపేట్, రోటిబండ తండా, పులిచర్లగుట్ట తండాల పరిధిలో పరిశ్రమలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. ఈ ఐదు గ్రామాల పరిధిలో 1,358 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించింది. ఇందులో 547 ఎకరాలు అసైన్డ్ భూమి, 90 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉండగా.. 721 ఎకరాల పట్టా భూమి ఉంది. మొత్తం 800 రైతులు భూములు కోల్పోనున్నారు. ఒక్కో రైతు సగటున ఎకరం నుంచి ఒకటిన్న ఎకరా భూమి కోల్పోనున్నారు. వీరిలో ఎక్కువ శాతం మంది సన్న చిన్నకారు రైతులే. వీరికి ఈ భూములు తప్ప వేరే జీవనోపాధి లేదు. దీంతో ఫార్మాసిటీని వ్యతిరేకిస్తూ వస్తున్నారు.

### వ్యతిరేక గళం

ప్రభుత్వం ఫార్మాసిటీని ప్రకటించింది మొదలు రైతులు వ్యతిరేక గళం వినిపిస్తూనే ఉన్నారు. వీరికి మొదట్లో బీఆర్ఎస్ మాత్రమే మద్దతు ప్రకటిస్తూ వచ్చింది. లగచర్ల ఘటన తర్వాత అరెస్టుల పర్వం మొదలు కావడంతో సీన్ పూర్తిగా మారిపోయింది. రైతులు సైతం ఏ మాత్రం జంకకుండా పోరుకు సిద్ధమయ్యారు. ప్రాణాలు పోయినా భూములు ఇచ్చేది లేదని తేల్చి చెబుతున్నారు. అరెస్టుల తర్వాత బీఆర్ఎస్ తన వాయిస్‌ను మరింత పెంచింది. బాధితులు రాష్ట్ర, దేశ రాజధానుల్లో తమ గోడును వెళ్లబోసుకుంటున్నారు. ఎస్సీ, ఎస్టీ, మానవ హక్కుల కమిషన్లను ఆశ్రయించారు. దీంతో వారికి మరింత మద్దతు పెరిగింది. బీజేపీ సైతం లగచర్ల బాధిత రైతులకు అండగా నిలవడంతోపాటు గళం వినిపిస్తోంది. వామపక్ష పార్టీలు సైతం రంగంలోకి దిగాయి. తాజాగా మంగళవారం మహిళా సంఘాలు సైతం లగచర్ల బాధిత రైతులను పరామర్శించేందుకు వెళ్లగా బొంరాస్‌పేట పోలీసులు వారిని అడ్డుకున్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, అడ్వకేట్ రాజశేఖర్ నిరసన గళం వినిపించారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు సాగిస్తున్న దమన కాండను ఆపాలని హితవు పాలికారు. లేదంటే కాంగ్రెస్ పార్టీ మూల్యాం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇలా రోజురోజుకూ ఫార్మా బాధిత రైతులకు అన్ని వర్గాల నుంచి మద్దతు లభిస్తోంది. ఇదే సమయంలో ప్రభుత్వం, అధికార పార్టీపై వ్యతిరేక గళం వినిపించే వారి సంఖ్య కూడా పెరుగుతూ వస్తోంది.



పరిగి: చలి మంట వేసుకున్న యువకులు

# చలి పంజా..

- రోజురోజుకూ పెరుగుతున్న చలి తీవ్రత
- 12 డిగ్రీలకు పడిపోయిన రాత్రి ఉష్ణోగ్రతలు
- జాగ్రత్తలు అవసరం అంటున్న వైద్యనిపుణులు

**బషీరాబాద్/పరిగి:** చలి తీవ్రత క్రమంగా పెరుగుతోంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు 12 డిగ్రీలకు పడిపోయాయి. చల్ల గాలులకు జలుబు, శ్వాసకోస సంబంధిత వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోంది. వారం రోజుల నుంచి ఉదయం కూడా చలి గాలులు వీస్తున్నాయి. ఖాళీ ప్రదేశాలు, పొలాల వద్ద మంచు కురుస్తోంది. ఉదయం ఎనిమిది గంటలైనా చలి వీడటం లేదు. దీంతో బయటకు రావడానికి ప్రజలు జంకురతున్నారు. బషీరాబాద్ మండలంలో చలితీవ్రత పెరిగింది. తెల్లవారుజామున మంచుకురుస్తోంది. దీంతో ప్రధాన రహదారుల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. మంగళవారం మర్పల్లి మండలంలో 11.2 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. దుద్యాల్ మండలంలో పగటి ఉష్ణోగ్రతలు గరిష్టంగా 33.9 డిగ్రీలుగా రికార్డయ్యింది. పరిగి మండలంలో పగటి ఉష్ణోగ్రతలు 25 నుంచి 28 డిగ్రీల వరకు ఉండగా రాత్రి 12 డిగ్రీలకు పడిపోతున్నాయి. రాత్రి ఆరు గంటలు దాటిందంటే చలి పెడుతోంది. ప్రజలు చలి మంటలు వేసుకుంటున్నారు.

### పాటించాల్సిన జాగ్రత్తలు

చలికాలంలో సాధారణంగా దగ్గు, జలుబు వస్తుందని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. దగ్గు, జలుబు, జ్వరం, గొంగునొప్పి, శ్వాసకోస సంబంధిత సమస్యలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. చలి తీవ్రత పెరుగుతున్నందున పిల్లలు, వృద్ధులు ఉదయం, రాత్రి వేళల్లో బయటకు వెళ్లకపోడమే మంచిదంటున్నారు.

బషీరాబాద్: చలి కాచుకుంటున్న జనం



## న్యూస్‌రీల్

### జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు రాకేశ్



రాకేశ్‌ను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

**పరిగి:** జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు పరిగి నంబర్ వన్ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి రాకేశ్ ఎంపికయ్యారు. మంగళవారం ఎంఈఓ గోపాల్ విద్యార్థిని అభినందించారు. ఇటీవల మెదక్‌లో జరిగిన అండర్ -14 బాలుర విభాగంలో నిర్వహించిన 68వ రాష్ట్రస్థాయి వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో రంగారెడ్డి జిల్లా రన్నరప్‌గా నిలిచింది. ఈ జట్టులో ఉన్న రాకేశ్‌ను రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపిక చేశారు. డిసెంబర్ 10 నుంచి వారణాసిలో జరిగే జాతీయ స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీ ఖాజా, ప్రవీణ్, ఇసాక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### బృహదీశ్వర్ ఎంపిక



బృహదీశ్వర్‌ను సన్మానిస్తున్న టీచర్లు

**కుల్కచర్ల:** మండలంలోని ముజాహిద్‌పూర్ మోడల్ స్కూల్‌కి చెందిన 9వ తరగతి విద్యార్థి బృహదీశ్వర్ జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. సోమవారం మెదక్‌లో జరిగిన అండర్ -14 బాలుర విభాగం వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. మంగళవారం పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థి బృహదీశ్వర్‌ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జ్యోతి హెప్సిభా మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో పీఈటీ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఆలన కేంద్రం సందర్శన



**అనంతగిరి:** అనంతగిరి గుట్టలోని ఆలన (పాలేటివ్ కేర్ సెంటర్) కేంద్రాన్ని మంగళవారం డీఎంహెచ్ఓ వెంకటరవణ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రోగులకు అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. ఈ కేంద్రంలో కేన్సర్, పక్షవాతం, హృదయ సంబంధ వ్యాధులతో బాధపడే వారికి సేవలు అందిస్తామని తెలిపారు. ఆయన వెంట ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ నిరోషా, రేణుకుమార్, జయరాం, సెంటర్ డాక్టర్ వాహబ్, డాక్టర్ సుప్రియ ఉన్నారు.

### ఘన నివాళి



ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్ తదితరులు

**అనంతగిరి:** దేశ మొదటి మహిళా ప్రధాని, స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఘన నివాళి అర్పించారు. వికారాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కిషన్‌నాయక్, చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, ముత్తాహర్ షరీఫ్, గంగులు తదితరులు పాల్గొన్నారు.

### అనంతుడి సేవలో కొండా



**అనంతగిరి:** వికారాబాద్ సమీపంలోని అనంతగిరి గుట్టలో వెలసిన అనంతపద్మనాభ స్వామిని మంగళవారం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ సిబ్బంది ఆయన్ను సత్కరించారు. ఈ సందర్భంగా అనంతగిరి పరిరక్షణ సమితి ప్రతినిధులు ఆలయానికి సంబంధించిన పలు సమస్యలను ఎంపీ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

# ప్రసవాలు ఎందుకు చేయడం లేదు

- వైద్యుడిపై కలెక్టర్ ఆగ్రహం
- పీహెచ్‌సీలో ఆకస్మికంగా తనిఖీ

**నవాబుపేట:** ప్రసవాలు ఎందుకు చేయడం లేదని నవాబుపేట పీహెచ్‌సీ వైద్యుడిపై కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి పరిసరాలను పరిశీలించి రోగులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రసవాల కోసం వచ్చే వారిని వేరే ఆస్పత్రులకు ఎందుకు పంపుతున్నారని వైద్యాధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై ఇక్కడే ప్రసవాలు చేయాలని ఆదేశించాడు. రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం ఆస్పత్రిలో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత లేకుంటే బిల్లులు చెల్లించమని స్పష్టం చేశారు. మరో పది రోజుల్లో ఆస్పత్రిని సందర్శిస్తానని అప్పటిలోగా పనులు పూర్తి కావాలని ఆదేశించారు. అనంతరం కస్తూర్బా గాంధీ పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. తమకు గదులు సరిపోవడం లేదని విద్యార్థులు కలెక్టర్‌కు విన్నవించారు. స్పందించిన ఆయన అదనపు గదుల కోసం ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచిచారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వెంకటరవణ, తహసీల్దార్ జైరాం, ఎంపీడీఓ అనురాధ, ఆర్ఐ రాజు తదిరతులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

### రైతులు ముందుకు రావాలి

**అనంతగిరి:** ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉద్యాన శాఖ, ఐకోపామ్ ఆయిల్ అండ్ ఫట్స్ ప్రైవేట్ ఇండస్ట్రీస్ సంయుక్త ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ పంట సాగుపై జిల్లాస్థాయి రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా ఉద్యాన అధికారి సత్తార్ మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ పంట ఆవశ్యకత, ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు గురించి వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్, జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి, శాస్త్రవేత్తలు, అధికారులు విజయన్, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

**మరుగుదొడ్లు వినియోగించాలి**

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లను వాడాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. మంగళవారం ప్రపంచ టాయిలెట్ డేను పురస్కరించుకుని కలెక్టరేట్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మరుగుదొడ్లు లేని వారు నిర్మించుకోవాలన్నారు. పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో డిసెంబర్ చివరి నాటికి టాయిలెట్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీఎంహెచ్‌ఓ వెంకటరవణ, డీడబ్ల్యూ కృష్ణవేణి, డీపీఓ జయసుధ, పీఆర్ ఈఈ ఉమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ చల్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇది ప్రభుత్వమా.. పోలీసు రాజ్యమా

- హక్కులను కాలరాస్తే ఊరుకోం
- నిర్బంధాలు, ప్రజా వ్యతిరేక నిర్ణయాలు ప్రభుత్వానికి మంచిది కాదు
- పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య
- లగచర్ల వెళ్తుండగా మహిళా నేతల అరెస్ట్



తుంకిమెట్ల వద్ద పీఓడబ్ల్యూ జాతీయ నాయకురాళ్లను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

**బొంరాస్‌పేట:** రాజ్యాంగబద్ధంగా కల్పించిన మహిళా హక్కులను కాలరాస్తే ఊరుకోమని ప్రోగ్రెసివ్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఉమెన్ (పీఓడబ్ల్యూ) జాతీయ కన్వీనర్ వి.సంధ్య అన్నారు. జాతీయ స్థాయికి పాకిన లగచర్ల ఘటనలో స్థానిక మహిళలు జాతీయ మహిళా సంఘాలకు చేసిన వినతికి స్పందించి తాము గ్రామానికి వెళ్తుండగా.. పోలీసులు ప్రభుత్వానికి వత్తాసుగా ఉంటూ తమను అడ్డగించడం సరికాదని మండిపడ్డారు. "మేం రాజకీయాలకు వ్యతిరేకం.. పోలీసులు నిర్వర్తిస్తున్న విధులు హక్కులకు భంగం కలిగించేలా ఉన్నాయి. నిర్బంధాలు, వ్యతిరేక నిర్ణయాలు ప్రభుత్వానికి మంచిది కాదు. ఇది ప్రజా ప్రభుత్వమా? పోలీసు నియంత రాజ్యమా? ముఖ్యమంత్రి వైఖరి ఇదేనా?" అని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం లగచర్లకు వెళ్తున్న జాతీయ, రాష్ట్ర మహిళా సంఘాల నేతలను మండల పరిధిలోని తుంకిమెట్ల వద్ద అడ్డుకున్న పోలీసులు వారిని స్టేషన్‌కు తరలించారు. ఈ సమయంలో మహిళా పోలీసులు, మహిళా నేతల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ జ్యోతి, పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు అనుసూయ, పీఓడబ్ల్యూ జాతీయ నాయకురాలు ఝాన్సీ, దామగుండం జేఏసీ నాయకురాలు గీత, ఓయూ జర్నలిజం ప్రొఫెసర్ పద్మజషా, వలస కార్మికుల సంఘం సిస్టర్ లీజీ తదితరులను పోలీసులు అరెస్ట్ చేశారు.

### భూములు లాక్కోవడం బాధాకరం

పలువురు మహిళా నేతలు మాట్లాడుతూ.. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలు, నిర్ణయాలతోనే కుప్పకూలిందన్నారు. కాంగ్రెస్ కూడా అదే పంథాను అవలంబిస్తోందని తెలిపారు. ఆరుగ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చి.. పేద ప్రజల వద్ద భూములను లాక్కోవడం, ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేయడం బాధాకరమని తెలిపారు. బాధితులకు తాము అండగా ఉంటామని స్పష్టంచేశారు. పరిగి డీఎస్పీ శ్రీనివాస్, కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, ఐఎస్ఐ ఎండీ అబ్దుల్ రవూఫ్ వారిని సముదాయించి రెండు గంటల తర్వాత తిరిగి పంపించారు. అంతకుముందు వీరి అరెస్టును నిరసిస్తూ రాష్ట్ర గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీరాంనాయక్, సీఐటీయూ జిల్లా నాయకుడు మహిపాల్ ధర్నాకు దిగారు. వీరి వెంట వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, రైతుసంఘం రాష్ట్ర నాయకుడు శోభన్‌నాయక్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మానాయక్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, కె.శ్రీనివాస్ తదితరులున్నారు. ఇదిలా ఉండగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తదితరులు గురువారం లగచర్లకు రానున్నట్లు తెలిపారు.



పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్యను సముదాయిస్తున్న సీఐ శ్రీధర్‌రెడ్డి

# మూసీ పునరుజ్జీవంతో అద్భుత ఫలితాలు

**స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్**

**అనంతగిరి:** మూసీనది పునరుజ్జీవ ప్రాజెక్టు పూర్తయితే అద్భుత ఫలితాలు వస్తాయని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మంగళవారం వికారాబాద్‌లోని ఎస్ఏపీ కళాశాలలో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హనుమంతరావు వాటర్ కాన్సెప్ట్ – వికారాబాద్‌లో నీటి భద్రత, మూసీ నది పునరుజ్జీవం అనే అంశాలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మన జిల్లా మెట్ట ప్రాంతమని, వర్షాధార మైనర్ ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు తప్ప మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు లేవన్నారు. జిల్లాలో మొత్తం సాగు విస్తీర్ణం 5.88 లక్షల ఎకరాలు ఉండగా.. ప్రాజెక్టులు, చెరువులు, బోర్లు, బావుల కింద సాగయ్యేది 1.57 లక్షలు మాత్రమే అన్నారు. మిగతాదంతా వర్షాధారమేనన్నారు. దివంగత ముఖ్యమంత్రి చెన్నారెడ్డి హయాంలో జిల్లాలో కోట్‌పల్లి, నందివాగు, సర్పన్‌పల్లి వంటి మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు నిర్మించారని పేర్కొన్నారు. కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి జిల్లాలోని కొంత ప్రాంతానికి నీళ్లందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. మూసీ జన్మస్థానం అయిన మన జిల్లాలో నీటి ప్రవాహం తక్కువగా ఉంటుందన్నారు. మూసీ పునరుజ్జీవం పనులు పూర్తయితే దీర్ఘకాల ఫలితాలు పొందవచ్చని పేర్కొన్నారు. అనంతరం ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమం నిధులు, నియామకాలు, నీళ్ల కోసం జరిగిందన్నారు. ఉన్న నీటిని ఒక పద్ధతి ప్రకారం వినియోగించుకోవాలని అన్నారు. అనంతరం ట్రస్టు కార్యదర్శి మర్రి శశిధర్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి, జల నిపుణులు నర్సింహారెడ్డి, డీపీ రెడ్డి, మహ్మద్ అఫ్సర్, సాయి సురేష్, హకీం, హౌసింగ్ బోర్డు మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, నాయకులు మైపాల్‌రెడ్డి, బస్వరాజు, గోవర్ధన్‌రెడ్డి, మాధవరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సదానందరెడ్డి, రమేష్‌కుమార్, కిషన్‌నాయక్, రఘుపతిరెడ్డి, కేపీ రాజు, డాక్టర్ ముత్తారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

## క్లుప్తంగా

### ఏఐటీఎఫ్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గోవింద్‌ నాయక్‌



కుల్కచర్ల: అఖిల భారత గిరిజన సమాఖ్య (ఆలిండియా ట్రైబల్‌ ఫెడరేషన్‌) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండల పరిధిలోని అడవివెంకటాపూర్‌కు చెందిన గోవింద్‌ నాయక్‌ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆయనకు రాష్ట్ర నాయకత్వం నియామకపత్రం అందజేసింది. ఈ సందర్భంగా గోవింద్‌ నాయక్‌ మాట్లాడుతూ.. గిరిజనుల అభ్యున్నతికి ఏఐటీఎఫ్‌ నిర్విరామంగా కృషి చేస్తోందన్నారు. తనపై నమ్మకంతో పదవి కట్టబెట్టిన సంఘం పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

### తాగిన మైకంలో బలన్మరణం



బోయిని గోపాల్‌(ఫైల్‌)

తాండూరు రూరల్‌: తాగిన మైకంలో ఓ లారీ డ్రైవర్‌ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన కరన్‌కోట్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని ఐనెల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన బోయిని నర్సింలు, నీలమ్మ దంపతులు కుమారుడు బోయిని గోపాల్‌(34) లారీ డ్రైవర్‌. ఆదివారం గోపాల్‌ భార్య వెంకటమ్మతో కలిసి బొంరాస్‌పేటలోని అత్తవారింటికి వెళ్లాడు. సోమవారం స్వగ్రామానికి చేరుకున్న గోపాల్‌ సాయంత్రం 4గంటల ప్రాంతంలో మద్యం సేవించాడు. ఇంటికి చేరుకున్న ఆయన ఇంట్లోని దూలానికి ఉరేసుకున్నాడు. విషయం గమనించిన స్థానికులు భార్యకు సమాచారం ఇచ్చారు. దీంతో వెంకటమ్మ స్థానికుల సాయంతో తాండూరు పట్టణంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం శవాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి ఇద్దరు కూతుళ్లున్నారు.

### రైతులకు ఇబ్బంది కలగొద్దు



పీఏసీఎస్‌ రైస్‌మిల్లు పరిశీలనకు వచ్చిన అధికారులు

కుల్కచర్ల: ధాన్యం సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని ఎన్‌ఫోర్స్‌మెంట్‌ ఎస్పీ శ్రీధర్‌రాజు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మోహన్‌బాబు అధికారులకు సూచించారు. మంగళవారం కుల్కచర్ల మండలం తిర్మలాపూర్‌లోని పీఏసీఎస్‌ రైస్‌మిల్లు, గోదాంను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎక్కడా లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్‌ సీఈఓ బక్కారెడ్డి, గోదాం ఇన్‌చార్జ్‌ ఉమాశంకర్‌, సొసైటీ డైరక్టర్‌ కొండయ్య పాల్గొన్నారు.

### బాలిక అదృశ్యం



రూపాలి(ఫైల్‌)

మైలార్‌దేవ్‌పల్లి: ఇంటి నుంచి బయటికి వెళ్లిన బాలిక అదృశ్యమైన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ పైడినాయుడు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. మహారాష్ట్ర, నాందేడ్‌ ప్రాంతానికి చెందిన పండిత్‌ పోదాడి, అంజలి దంపతులు కాటేదాన్‌ ప్రాంతానికి వలస వచ్చి కార్మికులుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి కుమార్తె రూపాలి (16) గత నెల 28న పనికి వెళ్లి తిరిగి రాలేదు.దీంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్‌ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



# అప్రమత్తతే ఆయుధం



గొడ్డు తెగులు సోకిన కంది పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు (ఫైల్‌)

- కందిలో సస్యరక్షణ చర్యలతోనే మేలైన దిగుబడులు
- తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్‌రాజేశ్వర్‌రెడ్డి

తాండూరు: వాతావరణానికి అనుకూలంగా ఎప్పటికప్పుడు కంది పంటకు ఎప్పటికప్పుడు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్‌ రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. కంది పంట ప్రస్తుతం పూత దశ నుంచి కాయ దశలోకి వెళ్లే సమయం కావడంతో పంటకు గొడ్డు తెగులు(ఎర్రి తెగులు), శనగపచ్చ పురుగు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని సూచించారు.

**వైరస్‌తో వ్యాప్తి**

కంది పంటకు గొడ్డు తెగులు వైరస్‌ వల్ల వ్యాప్తి చెందుతుందిది. తెగులు సోకి ఆకులపై గుండ్రటి లేత ఆకుపచ్చ రంగు మచ్చలు కనిపిస్తాయి. పిదప కొమ్మలు, ఆకులు విపరీతంగా పెరిగి గుబురుగా కనిపిస్తాయి. దీంతో పంటలో పూత తగ్గుతుంది. కాయలు తగ్గితే గొడ్డు తెగులు సోకినట్లుగా గుర్తించాలి. ఈ తెగులు ఇరియోఫిడ్‌ నల్లి ద్వారా వ్యాప్తి చెందుతోంది. దీని నివారణకు మందులు లేనందున తెగులును తట్టుకునే సీపీఎల్‌ 37119(ఆశా) లాంటి విత్తన రకాన్ని ఎంచుకోవాలి. ఈ తెగులు సోకిన మొక్కను పంట పొలంలో నుంచి పీకివేయాలి. నల్లి నివారణకు లీటరు నీటికి లీకెల్తేనేదా మూడు మిల్లీ లీటర్లు లేదా లీఒమైట్లేదా మూడు మిల్లీ గ్రాములు లేదా లీస్పైరోమెసిఫెన్లెదా 3 మిల్లీ గ్రాములు లేదా లీఫెనాక్సాక్విన్కలిపిని వారం రోజుల వ్యవధిలో రెండు మార్లు పంటకు పిచికారీ చేయాలి.

**శనగపచ్చ పురుగు**

వర్షం లేదా చిరుజల్లులు పడినప్పుడు శనగపచ్చ పురుగు పంటకు ఆశిస్తోంది. రాత్రి సమయంలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నా మొగ్గ, పూత, కాయ దశల్లో ఈ పురుగు ఉధృతి చూపుతుంది. ఈ పురుగు సెప్టెంబర్‌ నుంచి మార్చి వరకు ఎక్కువగా ఉంటుంది. వీటి తల్లి పురుగులు(రెక్కల పురుగులు) లేత ఆకుల మీద మొగ్గల మీద పువ్వుల మీద లేక కొమ్మలపైన ఒక్కొక్క గుడ్డును పెడతాయి. రైతులు పంటను పరిశీలించేటప్పుడు గుడ్ల సముదాయం కాకుండా ఒక గుడ్డు మాత్రమే కనిపిస్తే పంటకు శనగపచ్చ పురుగు ఆశించిందని గ్రహించాలి. శనగపచ్చ పురుగు గుడ్డు నుంచి బయటకు వచ్చిన పిల్ల పురుగు మొదట ఆకుల హరిత పత్రాన్ని గోకి తింటుంది. ఈ పిల్ల పురుగు తర్వాత గొంగళి పురుగుగా మారి మొగ్గ పూత దశలను ఆశించడంతో పూత రాలిపోతుంది. ఈ గొంగళి పురుగులు పిందె, కాయ దశల్లో కాయలకు రంధ్రాలు చేసి ఒక కాయ నుంచి మరో కాయకు ఆశించి కాయలను డొల్ల చేసి విపరీతంగా నష్టం చేకూరుస్తాయి. ఈ దశలో పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే దిగుబడులు గణనీయంగా తగ్గుతాయి. దీని నివారణకు సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపట్టాలి.

**సస్యరక్షణ చర్యలు**

- వేసవిలో లోతు దుక్కి చేయడం వల్ల భూమిలోని పురుగు కోశస్థ దశ బయటపడి పక్షులు తినేందుకు వీలుంటుంది.
- ఎర పంటగా బంతిని వేయాలి. ఎకరానికి 100 మొక్కలు మిత్ర పురుగులైన కందిరీగలు అక్షింతల పురుగులు కందిలోని కాయ తొలుచు పురుగులు, లద్దె పురుగులు, తెల్ల దోమ, ఆకు ముడత పురుగులను తింటాయి.
- ట్రైకోగ్రామా పరాన్న జీవి కందిలో కాయ తొలుచు పురుగు, లద్దె పురుగు గుడ్లను నష్టపరుస్తాయి. క్రైసోపా కాయతొలుచు పురుగు లార్వాలను, నేపాంటిలిస్‌-లద్దె పురుగు లార్వాలను తినేస్తుంది.
- ఎన్‌పీవీ వైరస్‌ ద్రావణాన్ని ఎకరాకు 250 మిల్లీలీటర్ల చొప్పున పంటకు పిచికారీ చేయాలి.
- పురుగు మందులను తట్టుకునే శక్తి కలిగినందున సమగ్ర యాజమాన్య పద్ధతులతో ఈ పురుగు ఉధృతి తగ్గించవచ్చు.
- రెక్కల పురుగుల ఉధృతిని అంచనా వేసేందుకు ఎకరాకు 4-5 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలి.
- గుడ్లను చిన్న పురుగులను నివారించడానికి ఐదు శాతం వేపగింజల ద్రావణాన్ని పిచికారీ చేయాలి.
- పురుగు ఆశించిన కాయలను ఎప్పటికప్పుడు పొలం నుంచి తీసివేసి నాశనం చేయాలి.
- గొంగళి పురుగులను తినే పక్షుల కొరకు ఎకరాకు 15-20 పక్షి స్థావరాలను ఏర్పాటు చేయాలి.
- చివరగా పురుగు ఉధృతిని బట్టి పంటకు మొగ్గ, తొలిపూత దశలో క్లోరిపైరిపాస్‌ 2.5 మి.లీ, పిందె, కాయదశలో క్వినాస్‌ పాస్‌ 2మి.లీ. లేదా ఎసిఫేట్‌ 1.5 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- ఉధృతి తగ్గని పక్షంలో ఎన్డ్రిక్షిక 1మి.లీ లేదా థయోడికార్బ్‌ 1 మి.లీ. లేదా ఇమమెక్టిన్‌బెంజోయెట్‌ 0.4 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

# ట్రైనింగ్‌ను శ్రద్ధగా పూర్తిచేయాలి

ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: వికారాబాద్‌లోని జిల్లా పోలీస్‌ శిక్షణ కేంద్రంలో కానిస్టేబుల్‌ అభ్యర్థులకు ఈనెల 21న పాసింగ్‌ పరేడ్‌ ఉన్నందున మంగళవారం ఎస్పీ నారాయణరెడ్డి సందర్శించి ట్రైనీ పోలీసుల పరేడ్‌ను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ట్రెనింగ్‌లో నేర్చుకునే పరేడ్‌ సర్వీస్‌ కాలం అంతా పనిచేస్తుందని, ప్రతిఒక్కరూ శ్రద్ధగా నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీసీ ప్రిన్సిపాల్‌ మురళీధర్‌, డీఎస్పీ విజయ్‌కుమార్‌, ఇన్‌స్పెక్టర్‌ వెంకట్రాం, ఆర్‌ఐ డేవిడ్‌, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమ.. పెళ్లి.. వేధింపులు.. ఆత్మహత్య

- విషాదంగా ముగిసిన అనాథ బాలిక జీవితం
- పురుగు మందు తాగి, చికిత్స పొందుతూ మృతి
- భర్త, అత్తమామ, ఆడపడుచులపై కేసు



స్వాతి(ఫైల్‌)

ధారూరు: ఓ అనాథ బాలికకు మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకోవడంతో పాటు వేధింపులకు గురిచేసి, ఆత్మహత్యకు ప్రేరేపించిన యువకుడు, అతని కుటుంబ సభ్యులపై పోక్సోతో పాటు పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్‌, గ్రామస్తుల వివరాలు ఇలా ఉన్నాయి.. ధారూరు మండల కేంద్రానికి చెందిన కె.మంజుల, యాదయ్య దంపతులకు కొడుకు, కూతురు సంతానం. మంజుల, యాదయ్య కొన్నేళ్ల క్రితం మరణించారు. మూడేళ్ల క్రితం వీరి కొడుకు కూడా మృతిచెందడంతో కూతురు స్వాతి(16) అనాథగా మిగిలింది. దోర్నాల్‌ గ్రామంలో ఉంటున్న అమ్మమ్మ బాలికను చేరదీసి, స్థానిక కస్తూర్బా విద్యాలయంలో చేర్పించింది. ఇదే సమయంలో కుక్కింద గ్రామానికి చెందిన యువకుడు శ్రీకాంత్‌ తాను స్వాతిని ప్రేమిస్తున్నానంటూ తీసుకెళ్లి, పెళ్లి చేసుకున్నాడు. ఏడాది పాటు వీరి కాపురం సజావుగానే సాగింది. ఆ తర్వాత భర్త శ్రీకాంత్‌తో పాటు అత్త, మామలు వెంకటమ్మ, యాదయ్య, ఆడపడుచులు స్వాతిని వేధించడం ప్రారంభించారు. వీరి ఆగడాలు భరించలేక ఈనెల 16న సాయంత్రం స్వాతి ఇంట్లో ఉన్న పురుగు మందు తాగి, స్పృహ కోల్పోయింది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందింది. స్వాతి ఆత్మహత్యకు కారణమైన భర్త, అత్త, మామ, ఆడపడుచులపై బాల్య వివాహం, వేధింపులు, పోక్సో, ఆత్మహత్యకు ప్రేరేపించడం తదితర సెక్షన్ల కింద కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

## ఆసరా పెన్షన్‌ పెంచండి

వీహెచ్‌పీఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య



స్పీకర్‌ ప్రసాద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీహెచ్‌పీఎస్‌ నాయకులు

అనంతగిరి: ప్రభుత్వం పెన్షన్‌ పెంపు విషయంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని వీహెచ్‌పీఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య డిమాండ్‌ చేశారు. ఆసరా పెన్షన్‌ పెంపుపై ప్రభుత్వం స్పందించాలనే డిమాండ్‌తో సంఘం ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట రిలే దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా సంఘం సభ్యులు స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు విజయ్‌కుమార్‌, నల్ల రాజు, జిల్లా అధ్యక్షుడు శ్యాం ప్రసాద్‌, బాలరాజు గౌడ్‌, వెంకటయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌ బాహాబాహీ



తాండూరు తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట గొడవపడుతున్న కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు

తాండూరు రూరల్‌: తాండూరు తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట మంగళవారం ఉద్రిక్తత నెలకొంది. ఒక్కసారిగా ఇరువర్గాల నాయకుల అనుచరులు కార్యాలయం ఎదుటనే బాహాబాహీకి దిగారు. అప్రమత్తమైన తహసీల్దార్‌ వెంటనే పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు ఇరువర్గాల వారికి నచ్చజెప్పారు. తహసీల్దార్‌ కార్యాలయ సిబ్బంది, స్థానికులు తెలిపిన ప్రకారం.. పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్‌ కౌన్సిలర్‌ ముక్తార్‌ నాజ్‌, కాంగ్రెస్‌ పార్టీ పట్టణ అధ్యక్షుడు హబీబ్‌లాలు వేర్వేరు పనుల మీద తహసీల్దార్‌ కార్యాలయానికి వచ్చారు. ఈ క్రమంలో ఆర్‌ఐ కార్యాలయంలో ఇద్దరు నాయకుల మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న ఇరువురు నాయకుల అనుచరులు తహసీల్దార్‌ కార్యాలయానికి చేరుకుని బాహాబాహికి దిగారు. ఒక్కసారిగా ఉద్రిక్తత చోటు చేసుకోవడంతో తహసీల్దార్‌ తారాసింగ్‌ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడకి వచ్చిన పోలీసులు ఇరువర్గాల నాయకులు చెదరగొట్టారు. ఇదే విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరగా.. వారి వ్యక్తిగత విషయంలో గొడవపడ్డారని.. ఇరువురినీ కార్యాలయం నుంచి పంపించానని చెప్పారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

# బీసీలరాజ్యాధికారమే లక్ష్యం



బీసీల సమరభేరి పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న నాయకులు

- బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్‌
- 25న బీసీల సమరభేరి

తాండూరు టౌన్‌: బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా పోరాడుతామని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు కందుకూరి రాజ్‌కుమార్‌ అన్నారు. మంగళవారం పట్టణంలో బీసీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఈ నెల 25న నిర్వహించనున్న బీసీల సమరభేరి వాల్‌ పోస్టర్‌ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్‌ మాట్లాడుతూ.. బీసీలకు రాజ్యాధికారం దక్కకుండా కొన్ని శక్తులు అడ్డుపడుతున్నాయన్నారు. ఏళ్ల నుంచి బీసీ అణిచివేతకు గురవుతూనే ఉన్నారు. రాష్ట్రంలో బీసీ కులగణన మాదిరిగానే కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోనూ అన్ని రాష్ట్రాల్లో బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్‌ చేస్తున్నామన్నారు. అప్పుటే చట్ట సభల్లో బీసీల సంఖ్య పెరిగి రాజ్యాధికారం దక్కుతుందన్నారు. బీసీలకు రాజ్యాధికారం దక్కే వరకు సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్‌.కృష్ణయ్య నేతృత్వంలో పోరాడుతామన్నారు. ఈనెల 25న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో బీసీల సమరభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు షుకూర్‌, వెంకటేష్‌, బస్వరాజ్‌, బసంత్‌, లక్ష్మణాచారి, నరేందర్‌, శ్రావణ్‌, టైలర్‌ రమేష్‌, రాము, అనిత, తస్లీమ్‌బేగం, తాంద్ర నరేష్‌, పరమేష్‌, జుంటుపల్లి వెంకటేష్‌, శివ, నర్సింలు, దత్తు, గోపాల్‌ తదితరులు పాల్గొన్నారు.

# భూములు ఇవ్వకుంటే కేసులా?

- సీఎం రైతులకు క్షమాపణ చెప్పాలి
- మాజీ ఎమ్మెల్యే కేఎస్‌ రత్నం




మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎస్‌ రత్నం

పూడూరు: భూములు ఇవ్వని రైతులపై థర్డ్‌ డిగ్రీ ప్రయోగిస్తారా..? ఇది ప్రజారాజ్యమా..పోలీసుల రాజ్యమా అని మాజీ ఎమ్మెల్యే కేఎస్‌ రత్నం ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం మండల పరిధిలోని మన్నెగూడలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లగచర్లలో జరిగిన ఘటనలో అమాయక రైతులపై కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురి చేయడం సరికాదన్నారు. ఫార్మా పేరిట రైతులపై థర్డ్‌ డిగ్రీ ప్రయోగించడం, భౌతికంగా దాడులు చేసి జైలుకు పంపించారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి రైతులకు క్షమాపణ చెప్పి కేసులు ఎత్తివేయాలని డిమాండ్‌ చేశారు. కలెక్టరే తనపై దాడి జరగలేదని చెప్పాక అరెస్టులు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు.

**తిరుపతిరెడ్డి ఎవరు?: మాధవరెడ్డి**

బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోకట్‌ మాధవరెడ్డి మాట్లాడుతూ.. ఫార్మాబాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న మహబూబ్‌నగర్‌ ఎంపీ డీకే అరుణ, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని అరెస్టు చేయడం బాధాకరమన్నారు. పోలీసులు తిరుపతిరెడ్డికి ఎస్కార్ట్‌ ఇచ్చి గౌరవించడం ఏంటని..? అసలు తిరుపతిరెడ్డి ఎవరని ప్రశ్నించారు. ఫార్మా ఏర్పాటును ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో దిశ కమిటీ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, వడ్ల నందు, ఫిల్మ్‌ సెన్సార్‌ బోర్డు సభ్యుడు మల్లేశం, బీజేపీ జిల్లా నాయకులు కేపీ రాజు, రమేశ్‌, రాముయాదవ్‌, రాజునాయక్‌, పార్టీ మండల అధ్యక్షుడు రాఘవేందర్‌ పాల్గొన్నారు.

### మరుగుదొడ్లపై అవగాహన




ముజాహిద్‌పూర్‌ మోడల్‌ స్కూల్‌ విద్యార్థుల ప్రదర్శన

కుల్కచర్ల: స్వచ్ఛ భారత్‌ మిషన్‌ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని కుల్కచర్లలో కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ముజాహిద్‌పూర్‌ గ్రామంలోని ప్రభుత్వ మోడల్‌ స్కూల్‌లో విద్యార్థులు స్వచ్ఛ భారత్‌ పేరును ప్రస్ఫుటించే విధంగా నిలబడి అందరిని ఆకట్టుకున్నారు.

### కల్లు దుకాణాలపై ఎక్సైజ్‌ దాడులు



ఓ కల్లు దుకాణంలో శాంపిల్స్‌ సేకరిస్తున్న ఎక్సైజ్‌ ఎస్‌ఐ ఖాజామొయినుద్దీన్‌, సిబ్బంది

చేవెళ్ల: మండల పరిధిలోని పలు గ్రామాల్లోని కల్లు దుకాణాల్లో మంగళవారం చేవెళ్ల ఎక్సైజ్‌ పోలీసులు తనిఖీలు చేపట్టారు. మండల పరిధిలోని ఖానాపూర్‌, దామరగిద్ద, అంతారం, గొల్లపల్లి, ఇబ్రహీంపల్లి, కౌకుంట్ల తదితర గ్రామాల్లో చేవెళ్ల ఎక్సైజ్‌ సీఐ శ్రీలత ఆదేశాలతో ఎస్‌ఐ ఖాజామొయినుద్దీన్‌ సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో ఆయా కల్లుదుకాణాల్లో శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌లకు పంపించినట్లు సీఐ శ్రీలత తెలిపారు. నిషేధిత మత్తు పదార్థాలను కల్లు తయారీలో ఉపయోగించటంపై నిఘా ఉంచామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రసాయనాలు కలిపినట్లయితే ఆ కల్లు దుకాణాల యజమానులపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

# అభివృద్ధిలో పేదలకే ప్రాధాన్యం

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: పేదలు అధికంగా నివసించే కాలనీల్లో అభివృద్ధి పనులకు తొలి ప్రాధాన్యం కల్పిస్తామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మల్‌రెడ్డిపల్లి ప్రాంతంలో రూ.2.08 కోట్ల నిధులతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాండూరు మున్సిపాలిటీ దశాబ్ద కాలంగా అధ్వానంగా మారిందన్నారు. మున్సిపాలిటీలో మురుగు కాల్వలు లేక పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారయిందన్నారు. దశాల వారీగా డ్రైనేజి, సీసీ రోడ్లను మెరుగు పరుస్తామన్నారు. మొదటగా అధికంగా ఇబ్బందులకు గురవుతున్న ప్రాంతాలను గుర్తించామనారు. త్వరితగతిన పనులను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా వార్డుల కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



భక్తులతో కలిసి దీపాలను వెలిగిస్తున్న ఎమ్మెల్యే

**కార్తీక దీపోత్సవం**

పట్టణంలోని కట్టమైసమ్మ దేవాలయంలో మంగళవారం కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవాలకు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి దేవాలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. కార్తీక దీపాలను వెలిగించారు.

## బైక్‌ను ఢీకొట్టిన ఆటో

ప్రధానోపాధ్యాయుడికి తీవ్ర గాయాలు

తాండూరు రూరల్‌: రోడ్డు ప్రమాదంలో ఓ ప్రధానోపాధ్యాయుడు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండల పరిధిలోని గౌతాపూర్‌ సమీపంలోని రిలయన్స్‌ పెట్రోల్‌ బంక్‌ వద్ద చోటు చేసుకుంది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. పట్టణంలోని ఇంద్రానగర్‌లో నివాసముంటున్న రమేశ్‌ జాదవ్‌ మిట్టబాసుపల్లి ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్నాడు. ప్రస్తుతం కుటుంబ సర్వే సూపర్‌వైజర్‌ బాధ్యతలు సైతం నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఆయన పాఠశాల నుంచి బైక్‌పై తాండూరు వైపు ప్రయాణిస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న ఆటో బైక్‌ను ఢీకొట్టడంతో రమేశ్‌ జాదవ్‌ బైక్‌పై నుంచి పడిపోయాడు. దీంతో ఆయన తలకు, చెవి భాగంలో తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే ఆయనకు తాండూరులోని ఓ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి అనంతరం నగరంలోని నిమ్స్‌ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.



గాయపడిన హెచ్‌ఎం రమేశ్‌ జాదవ్‌

# మల్కీజ్‌గూడలో రెండో రోజు విచారణ

యాచారం: మల్కీజ్‌గూడ గ్రామంలోని డ్వాక్రా సంఘాల్లో నిధుల అవకతవకలపై మంగళవారం రెండో రోజు విచారణ కొనసాగింది. యాచారం ఎస్‌బీఐ మేనేజర్‌ జాన్సీ, సెర్ప్‌ ఏపీఎం సుదర్శన్‌రెడ్డిలతో పాటు బ్యాంకు, సెర్ప్‌ సిబ్బంది పాల్గొన్నారు. ఏడాది కాలంగా విలేజ్‌ బుక్‌ కీపర్‌ వరికుప్పల రాణి ఏఏ సంఘాలకు ఎన్ని రుణాలు ఇప్పించింది? రికవరీ ఎలా ఉంది?రుణాలు పొందిన మహిళలు మల్కీజ్‌గూడ గ్రామానికి చెందిన వారేనా..? తీసుకున్న రుణాలు ప్రతీ నెల వాయిదాలు సక్రమంగా చెల్లిస్తున్నారా అనే విషయాలపై రికార్డులను తనిఖీలు చేశారు. గ్రామంలోని 45 సంఘాల రికార్డులను మహిళా సంఘాల సభ్యుల సమక్షంలోనే పరిశీలించనున్నట్లు సెర్ప్‌ ఏపీఎం సుదర్శన్‌రెడ్డి తెలిపారు.